# పనికిమాలిన వ్యక్తి

రచన : కాంచనపల్లి వేంకటరంగారావు

అదృష్టం అనేది ఒకరి సొమ్ముకాదు. ఒక్కొక్కడు పుట్టిన నాటినుండి చనిపోయేవరకు దర్జాగానే జీవితంగడుపుతాడు. ఒక్కొక్కడి జీవితం దీనికిసరిగ్గా వ్యతిరేకం. మధ్యలో బాగుపడి, మధ్యలోనే మాసిపోయిన వారుకూడా ఉన్నారు. కాని ఏ అదృష్టం, దురదృష్టం అయినా భార్యాపిల్లలు లేకుండావుంటే అదారి వేరు. సంసారంతోటి దారి వేరు.

వెంకటేశం ఎన్ని కష్టాలోపడి ఎలాగో చదువు పూర్తిచేశాడు. ఈలోగా తల్లిదండ్రుల తద్దినాలు రెండుసార్లు పెట్టాడు. ఈలోగా భార్య కాపరానికి వచ్చింది. ఒకరికి యిద్దరు అయారు. ముగ్గురు కాకుండానే ఉద్యోగం కోసం ప్రయత్నించడం ప్రారంభించాడు కాని ముగ్గురు పిల్లలుపుట్టే పర్యంతం ప్రయత్నించినా ఆపాడు నౌకరీ ఎక్కడా దొరికిందికాదు.

పెట్టవలసిన ఆఫీసులకన్నీ అర్జీలుపెట్టాడు.

చూడవలసిన అధికారులందరినీ చూశాడు.

మ్రొక్కవలసిన దేముళ్లకల్లా మ్రొక్కాడు.

తనజాతకం చూపెట్టి ఎంతోమంది జ్యోతిష్యులతో ఆలోచించాడు.

కనపడ్డ సాముద్రికుడికల్లా తన రెండు అరచేతులు వప్పగించి గంటలతరబడి వాళ్ళ నోటివెంటవచ్చే సంతోషవార్తలకోసం నిరీక్షించేవాడు; వాళ్లే తన లలాటలిఖితాన్ని మార్చేటట్లు ఎవరు ఏమిచెపుతే అది సంసారం పోషించే నిమిత్తం, వుద్యోగ సేకరణకోసం చేస్తూ వచ్చాడు. చేతులోవున్న ఆ కాస్తడబ్బు అయిపోయింది. భార్యా పిల్లలు అస్తిపంజరాలలాగు తయారయ్యారు తగిన తిండిలేక.

ఇంటికి వెళ్ళడం భయమైపోయింది. భార్యాబిడ్డల ఘోష చూడలేకపోయాడు. ఆఫీసు ఉద్యోగాలు యిక దొరకవు అని నిశ్చయించుకొని మిలిటరీ సర్వీసుకోసం ప్రయత్నించాడు తుదిదశగా. దానికికూడా ఆ అధికారులు 'నువ్వు నీరసంగా ఉన్నావు; బలంలేదు. బక్కచిక్కిన నీకు మిలటిరీలో ఉద్యోగ మెలావస్తుందయ్యా బలిసిరా!' అనే వివిధ రిమార్కులతో త్రోసి పారేశారు.

ఇంకేంచేస్తాడు? మరేగత్యంతరం కన్పించడంలేదు. అప్పటికప్పుడే వారం రోజులై తిండిలేదు. కళ్ళు లోతుకుపోయాయి. కాళ్ళు లోటలోట లాడుతున్నాయి. వొళ్లు ఎంత కృసించాలో అంతా కృసించింది.

ఈ పరిస్థితిలో భార్యా పిల్లలు జ్ఞాపకానికి వచ్చారు. తనచేతకాని తనానికి దుఃఖించాడు. మిలిటరీ అధికారులు అన్న కడపటిమాట 'అన్‌ఫిట్' అనేది పదేపదే తలపుకు వస్తోంది. 'నాకు యీ ప్రపంచం పనికిరాదు. ప్రపంచానికి నేను పనికిరాను. అంచేత పనికిరాని ప్రపంచానికైనా నేను పనికిరాక కాకపోతానా?' అనే ఆలోచనచేస్తూ శోషవచ్చి నడిరోడ్డుమీద పడిపోయాడు.

అడ్డు ఆపులులేకుండా, 'నీవు యీ ప్రపంచానికి Unfit గనుక బ్రతికి లాభంలేదు.' అనే మాటను మిలిటరీలారీ కార్యరూపంగా చేసి చూపెట్టింది. అంతటితో వెంకటేశానికి యీ పనికిరాని ప్రపంచంతో సంబంధం పూర్తిగా వదలిపోయింది.

* * *

"ఎవరు చేసుకున్నది వారు అనుభవించక తప్పుతుందా? కర్మపరిపాకం అయిపోయింది నేటితో" అన్నారు వృద్ధ జంబుకాలు తమకర్మ ఎలా తెలుసుకోలేక.

'మన వైశ్యసంఘంలో ఎటువంటి సానుభూతీ లేదండి, తిండికిలేక మలమల మాడుతూవుంటే చూస్తూ వూరుకుందేగాని పాడుసంఘం పిడికెడు బియ్యంవెయ్యదు.' అన్నారు సంఘ సంస్కారులు తామేమిటో పూడబొడిచినట్లు.

పత్రికలవాళ్ళు 'ప్రమాదం' అనే పేరుతో ఆ వార్త ప్రచురించారు, అంతటితో తమ బాధ్యత తీరినట్టు!